# కథ

# మేడిపండు చూడ...

వేంపల్లి రెడ్డినాగరాజు

"కాబట్టి మీరంతా విద్యార్థి దశనుండీనే వివిధ సామాజిక కార్యక్రమాలను చేపట్టడం ద్వారా పూజ్య బాపూజీ, చాచాజీ వంటి మహాత్ములు కలలుగన్న గ్రామ స్వరాజ్యం తెచ్చేందుకు కృషి చేయాలని, ఈ విషయంలో మీరు చేసే ప్రతి పనికి నా వంతు సహకారం ఎల్లప్పుడూ వుంటుందని తెలియజేసుకుంటున్నాను" పతాకావిష్కరణ అనంతరం గంటకు పైగా సాగిన తన స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని ముగించి విద్యార్థుల కరతాళ ధ్వనుల మధ్య ఉచితాసనంలో ఆసీనులయ్యారు ఎమ్మెల్యేగారు.

మరికొందరి ప్రసంగాల అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, క్రీడా పోటీలలో విజేతలకు ముఖ్య అతిథి హోదాలో ఎమ్మెల్యే చేతుల మీదుగా బహుమతుల ప్రదానం ముగిశాక జెండా పండుగ సంబరాలు వైభవంగా పూర్తయ్యాయి.

***

"మౌనంగానే ఎదగమనీ మొక్క నీకు చెబుతుందీ" రింగ్‌టోన్ శ్రావ్యంగా సందడి చేయడంతో లెక్చరర్ చంద్రశేఖర్ తన జేబులోని మొబైల్‌ను చేతిలోకి తీసుకుని స్క్రీన్ వైపు చూశారు. ఇదివరకూ ఫీడ్ కాని క్రొత్త నెంబర్. ఎవరై వుంటారనుకుంటూ రిసీవర్ బటన్ ప్రెస్ చేసి మొబైల్ చెవివద్ద ఆనించుకున్నాడు.

"హలో చంద్రశేఖర్‌గారేనా?" అవతలి వైపు నుండీ వినిపించింది.

"అవునండీ చంద్రశేఖరాన్నే" బదులిచ్చారు అపరిచిత కంఠాన్ని గుర్తు పట్టేందుకు ప్రయత్నిస్తూ.

"నేను ఎమ్మెల్యే పి.ఏ.ని మాట్లాడుతున్నానండీ"

"చెప్పండి సార్, నాతో ఏం పని?" అడిగాడు చంద్రశేఖర్.

"ఎమ్మెల్యేగారు తనను ఓసారి కలుసుకోవాల్సిందిగా మీకు కబురు పెట్టమన్నారండీ" చెప్పాడు పి.ఏ.

"దేని గురించి సార్?" సందేహంగా ప్రశ్నించాడు చంద్రశేఖర్.

"సంగతేమిటో నాక్కూడా తెలీదండీ"

"ఎప్పుడు కలుసుకోవాలి సార్?" చంద్రశేఖర్ కంఠంలో ఆత్రుత ధ్వనించింది.

"ఈ రోజు సాయంత్రం గెస్ట్‌హౌస్ వద్ద కలుసుకోమన్నారండీ" సమాచారం అంతేనన్నట్లుగా ఆ వైపు నుండీ లైన్ కట్ అయ్యింది.

ఎమ్మెల్యేగారికి నాతో ఏం పని వుంటుందబ్బా అనుకుంటూ మరుసటి రోజున డిగ్రీ ఫైనలియర్ స్టూడెంట్స్‌కు చెప్పే వీలుగా నోట్స్ ప్రిపేర్ చేసుకుంటున్న పనిని వాయిదా వేసి కాఫీ కోసం ఎదురుగా వున్న హోటల్ వైపు వెళ్ళాడు చంద్రశేఖర్. కాఫీ కోసం అప్పుడే అక్కడికొచ్చిన మరో కొలీగ్ లెక్చరర్ నిరంజన్‌తో మాట్లాడుతూ ఎమ్మెల్యే నుండీ తనకు వచ్చిన పిలుపు గురించి ప్రస్తావించాడు.

"బదిలీపై మీరు ఈ కాలేజీకి వచ్చిన ఈ ఏడాది కాలంలోనే జరిగిన పరీక్షల్లో మన స్టూడెంట్స్ మంచి ప్రతిభ కనబరచి యూనివర్సిటీ స్థాయిలో ర్యాంకులు సాధించిన విషయం ఇటీవల అన్ని పత్రికల్లోనూ విశేషంగా ప్రచురితం అయ్యింది కదా, ఆ సంగతి గుర్తించే నిన్ను వ్యక్తిగతంగా అభినందించేందుకు పిలిచివుంటారు కాబోలు" చెప్పాడు కొలీగ్ నిరంజన్.

ఆ మాటలు వింటూనే చంద్రశేఖర్ మనస్సు ఆనందంతో పొంగిపోయింది. కాలేజీ వదిలేందుకు సమయం ఇంకా గంట మాత్రమే వున్నా గడియారంలోని ముళ్ళు ఎంతకూ కదలనట్లుగా క్షణమొక యుగంలా భారంగా అనిపించింది చంద్రశేఖర్‌కు.

***


ఎట్టకేలకు ఆరు గంటల ప్రాంతంలో చంద్రశేఖర్ వూరికి దూరంగా ఎమ్మెల్యే అధునాతనంగా కట్టించుకున్న గెస్ట్‌హౌస్ వద్దకు చేరుకున్నాడు. అక్కడి వాతావరణం పార్టీ కార్యకర్తలు, కాంట్రాక్టర్లు, పలువురు నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన కొందరు అధికారులు, ఉద్యోగులతో కాస్తంత సందడిగానే వుంది.

"రండి లెక్చరర్‌గారూ, సార్ మీ కోసమే ఎదురు చూస్తున్నారు" చంద్రశేఖర్‌ను గుర్తుపట్టిన పి.ఏ. ఆయనను తన వెంట బెట్టుకుని ఎమ్మెల్యే వున్న గదిలోకి తీసుకుని వెళ్ళారు.


ఏ మాత్రం చప్పుడు చెయ్యని ఏ.సీ. గదిలో అలుముకుని వున్న ప్రశాంతతను భగ్నం చేస్తూ "నమస్కారం సార్, పిలిపించారట" అన్నాడు చంద్రశేఖర్ ఎమ్మెల్యే వైపు చూసి చేతులు జోడిస్తూ.

"నువ్వేనటయ్యా లెక్చరర్ చంద్రశేఖర్?" అడిగాడు ఎమ్మెల్యే సాలోచనగా చూస్తూ.

"అవును సార్" చంద్రశేఖర్ వినయంగా బదులిచ్చాడు.



ఏ మాత్రం చప్పుడు చెయ్యని ఏ.సీ. గదిలో అలుముకుని వున్న ప్రశాంతతను భగ్నం చేస్తూ "నమస్కారం సార్, పిలి పించారట" అన్నాడు చంద్రశేఖర్ ఎమ్మెల్యే వైపు చూసి చేతులు జోడిస్తూ.




"ఎన్నేళ్ళయ్యింది సర్వీసులో చేరి?" మళ్ళీ ప్రశ్నించాడు ఎమ్మెల్యే.

"పధ్నాలుగేళ్ళు దాటింది సార్" చెప్పాడు తను సర్వీసులో చేరిన రోజుల్ని తలుచుకుంటూ.

"ఇంతవరకు ఎన్ని కాలేజీల్లో పని చేశావ్?" అడిగారు ఎమ్మెల్యే జేబులో నుండీ సిగరెట్ పాకెట్‌ను, లైటర్‌ను తీస్తూ.

"నాలుగు కాలేజీలు చేశాను సార్, ఇది అయిదవది, ఏడాది కావస్తోంది ఇక్కడికి వచ్చి" చెప్పాడు చంద్రశేఖర్, తన సర్వీసు గురించి ఎమ్మెల్యే ఎందుకు ఆరా తీస్తున్నాడో అర్థంగాక.

"మళ్ళీ తొందరగా మరో కాలేజీకి బదిలీ కావాలనుకుంటున్నావా?" ఈసారి ఈ ప్రశ్న అడుగుతుండగా ఎమ్మెల్యే గొంతులో కాస్తంత కఠినత్వం చోటు చేసుకుంది.

"ఎందుకు సార్ అలా అడుగుతున్నారు?" ఉరుముల్లేని పిడుగులా ఎమ్మెల్యే నుండీ ఆ తరహా ప్రశ్న తూటాలా ఎందుకు దూసుకొచ్చిందో అర్థంగాక అయోమయంగా చూస్తూ నీళ్ళు నములుతూ అడిగాడు చంద్రశేఖర్.

"తీసుకుంటున్న జీతానికి నీ మానాన నువ్వు పని చేసుకోక తగుదునమ్మా అంటూ అన్ని విషయాల్లో జోక్యం చేసుకుంటున్నావని నీ మీద వస్తున్న ఫిర్యాదులు వినలేకపోతున్నానయ్యా" అన్నాడు ఎమ్మెల్యే తీవ్ర కోపంగా.

"కాలేజీలో పిల్లలకు పాఠాలు చెప్పడం, నా ఇంటి వ్యవహారాలు చూసుకోవడం మినహాయించి మరే విషయాల్లోనూ జోక్యం చేసుకోడం లేదుగద సార్"

ఎమ్మెల్యే వేరొకరి గురించి విని పొరబడి తనను పిలిపించి వుండవచ్చుననుకుంటూ మెల్లగా అన్నాడు చంద్రశేఖర్.

"కాలేజీలో పాఠాలకు తోడుగా అదేదో ఇంకో పదవిని గూడా వెలగబెడుతున్నావట గదయ్యా" అడిగాడు ఎమ్మెల్యే.

"అవును సార్, డిగ్రీ విద్యార్థులకు 'ఎన్.సి.సి.' ఆఫీసర్ ఇన్‌ఛార్జిగా వుంటున్నా" బదులిచ్చాడు చంద్రశేఖర్.

"వచ్చిన అసలు చిక్కంతా దానివల్లనేనయ్యా"

"దానివల్ల మీకేం సమస్య సార్?" అయోమయానికి గురౌతూ అడిగాడు.

"మా పార్టీ కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు, అనుచరులందరూ నీ వల్లనే తాము చాలా ఇబ్బంది పడుతూ తీవ్రంగా నష్టపోతున్నామని గగ్గోలు పెడుతూ వాపోతున్నారు" ఎమ్మెల్యే స్వరంలో కోపం ఏమాత్రం తగ్గలేదు.

"మీరంటున్నదేమిటో నాకు బొత్తిగా అర్థం గావడంలేదు సార్" అన్నాడు చంద్రశేఖర్.

"ఏడాదిలో వరుసగా ఏ నాలుగు రోజులు శెలవులు వచ్చినా 'క్యాంపు'ల పేరిట పిల్లలందరినీ రామదండులా వెంట బెట్టుకుని వెళ్ళి పల్లెల్లో రోడ్లు వేయడం, చెరువుల్లో పూడిక తీయడం వంటి పనులన్నీ చేయిస్తున్నావట" ఉగ్రంగా చూస్తూ అడిగాడు ఎమ్మెల్యే.

"ఈ రకంగా చేస్తే విద్యార్థి దశలోనే వాళ్ళకు సామాజిక సేవాగుణం అలవడి ప్రజలకు మంచే జరుగుతుంది గదా సార్" చంద్రశేఖర్ మాటల్లో ఒకింత ధైర్యం తొణికిసలాడింది.

"నీ బోడి మంచి ఎవడికి కావాలయ్యా, నీతులు పెద్ద చెప్పొచ్చావుగానీ రోడ్లు పనులకు, చెరువుల పూడికతీతకు కాంట్రాక్టులు ఇప్పిస్తానని, దాని ద్వారా నాలుగు రూకలు వెనుకేసుకోవచ్చునని నన్నే ఎంతగానో నమ్ముకుని వున్న నా వాళ్ళందరికీ ఎలా ఉపాధి కల్పించేదయ్యా సామాజిక సేవ పేరిట నీలాంటివాళ్ళు అడ్డు తగిలితే" నరసింహావతారం ఎత్తాడు ఎమ్మెల్యే.

అసలు విషయం అర్థం కాగానే ఎమ్మెల్యే ఉద్దేశ్యం బోధపడింది చంద్రశేఖర్‌కు.

"నువ్వు జోక్యం చేసుకోవడంతో ఇప్పటి వరకు తమకు దక్కాల్సిన లక్షల నిధులన్నీ వెనక్కు మళ్ళుతున్నాయని గొడవ చేస్తున్నారయ్యా మా కార్యకర్తలు" మళ్ళీ తనే అన్నాడు ఎమ్మెల్యే తన అనుచరులు కోల్పోయిన 'ఉపాధి'ని గుర్తు చేస్తూ.

"విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని, మీ వంతు పూర్తిగా సహకారం అందిస్తానని మొన్ననే చెప్పారుగద సార్, కానీ ఇప్పుడిలా" అనబోయాడు చంద్రశేఖర్.

"చెప్పినవన్నీ చేస్తే మేము రాజకీయాలు నడిపినట్లేగానీ, నీ పద్ధతి మార్చుకుని మా వాళ్ళ 'నోటికాడి కూడు' తీసేపని మానుకుంటావా? లేక నీ బదిలీ గురించి మినిష్టర్‌గారితో మాట్లాడమంటావా?" తన ఆఖరి బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు ఎమ్మెల్యే.

చంద్రశేఖర్ మొహం నల్లగా పాలిపోయింది. "అయినా నీలాంటివాళ్ళ అడ్డు తొలగించుకోకుంటే వార్డుమెంబర్‌గా రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన నేను పదిహేనేళ్ళ లోపే ఎమ్మెల్యేగా ఎదిగేవాడిని కాదు పంతులూ" గంభీరంగా నవ్వుతూ అన్నాడు ఎమ్మెల్యే ఇక నువ్వు వెళ్ళవచ్చునన్నట్లుగా చూస్తూ.

***

మేడిపండు చూడ మేలిమైవుండు, పొట్ట విప్పి చూడ పురుగులుండు...

జరిగిన సంగతులన్నీ ఆలోచించుకుంటూ ఇల్లు చేరుకున్న చంద్రశేఖరానికి తన కొడుకు బిగ్గరగా వల్లె వేస్తున్న వేమన శతకంలోని పద్యం వినిపించింది.